8. పార్వతీదేవి తపస్సు

- శ్రీనాథుడు

*ఆంధ్ర వాఙ్మయరంగమున కవిత్రయము తరువాత మిక్కిలి ప్రసిద్ధుడైన మహాకవి శ్రీనాథుడు. భీమాంబ, మారయలకు పుత్రుడై జన్మించి, వారల కీర్తిని కూడా వ్యాప్తిగావించిన మహనీయుడు. క్రీ.శ. 1370 నుండి 1450 మధ్యకాలమున జీవించినట్లు తెలియుచున్నది. పలుప్రాంతములు సంచరించినను ఎక్కువగా రెడ్డిరాజుల పోషణమున కీర్తినార్జించిన కవియితడు. ప్రౌఢదేవరాయల కొలువులోనే డిండిమభట్టును తన ప్రతిభావైదుష్యములతో అతనినోడించి **"కవిసార్వభౌమ"** బిరుదమును పొందెను.*

*శ్రీనాథుడు సంస్కృత మహాకావ్యములు, పురాణములందలి ఘట్టముల నాధారముగా గైకొని ఆంధ్రములో కావ్యములు రచించెను. **శృంగారనైషధము, హరవిలాసము, భీమఖండము, కాశీఖండము, మరుత్తరాట్చరిత్ర, పల్నాటివీరచరిత్ర** వీరి రచనలలో పేర్కొనదగినవి. ప్రబంధ యుగకవులకితడు మార్గదర్శకుడని పేర్కొనదగును.*

శ్రీనాథుని కవిత్వము సంస్కృతపదభూయిష్టముతో గూడి ప్రౌఢమై మనోహరమై, పదప్రయోగాదులందు శాస్త్రపాండిత్యము కూడా తొణికిసలాడుచుండును.

*ప్రస్తుత పాఠ్యభాగమైన **'పార్వతీదేవి తపస్సు'** హరవిలాసములోని చతుర్థాశ్వాసమునుండి స్వీకరింపబడినది. ఇందు పార్వతి పరమశివునిగూర్చి తపస్సు గావించుట, కపటవటువు పార్వతిని పరీక్షించుట, శివుని సాక్షాత్కారము చక్కగా వర్ణింపబడియున్నవి.*

వ. అంత నొక్క చందంబున నా చంద్రానన సఖీముఖంబున నిజ
మనోరథంబుఁదండ్రి కెఱింగించి యమ్మహానుభావుచేత నరణ్యా
నివాసమునకును, ఫలోదయాంతం బై న తపస్సమాధికిని నానతి
వడసి దృఢప్రతిజ్ఞా నిర్వాహంబున. 1

ఉ. భూధర రాజకన్య మణిభూషణముల్ దిగ(ద్రావి యీశ్వరా
రాధనకేళికౌతుక పరాయణ యై భరియించెఁ బాండుర
క్షాధృతిపూర్వకంబుగఁ బ్రగాఢపయోధరమండలీసము
త్సేధవిశీర్ణ సంహతులఁ జెల్లు మహీరుహవల్కలంబులన్. 2

తే. చంచరీకాంగ నాగరుచ్ఛాయ నలరు
కుటిలకోమలతరదీర్ఘ కుంతలములు,
మడమ లంటంగ నిడు పాటిజడలు గట్టఁ
బాశుపతమంత్రదీక్షఁజేపట్టె గౌరి. 3

సీ. ముత్యాలమొలనూలిమురువుసూపెడునట్టి
జఘనంబుపై మౌంజి నవధరించెఁ
గందుకక్రీడపై గారాబు పచరించు
హస్తాబ్జములఁ బూనె నక్షమాల
కస్తూరికాంగరాగములతో విలసిల్లు
తనువల్లి హత్తించె ధవళభూతి
బొమ్మపెండిలిపాటఁ బ్రొద్దుపుచ్చు నెలుంగు
నీలకంఠ స్తోత్రనియతిఁ గూర్చెఁ

తే. బసిఁడికమ్ములయందంపుఁబట్టుచేల
కొంగుచాటున వర్ధిల్లు కుచభరమున
గంతగా వై చెఁ బులితోలుకళవసంబుఁ
బరమకళ్యాణి గిరిసార్వభౌమతనయ. 4

తే. హంసతూలికపాన్పుపై నలరుమొగ్గ,
యొత్తు నునుమేను గల్గు నీలోత్పలాక్షి
బాహువల్లి తలాడగాఁ బవ్వళించె,
శై లపాషాణపట్టికాస్థండిలమున 5

తే. పాశుపతమంత్రదీక్షావిభాసమాన
దివ్య తేజోవిశేషసందీ ప్తమూ ర్తి,
కాలతాంగికి శతవృద్ధు లైన మునులు,
ప్రణతు లగుదురు భావిప్రభావశక్తి. 6

వ. ఇవ్విధంబున నబ్బింబాధర ధరశిఖరంబులయందలి హరిణ కిశో
రంబులకు నరణ్య బీజాంజలిదానంబునుం దరులతా కుంజంబు
లకు నిర్ఝరసలిలాధారాసేకంబును నొనర్చుచుఁ గృష్ణాజినోత్తరా
సంగవతియు, సర్వాంగ భసితాభ్యంగ మంగళస్నానయు నై కొంత
గాలంబు గడపి, కాంక్షి తంబు కడఁగానక తెంపుసేసి మండువేసవిం
గనగనమండు నగ్ని గుండంబు నడుమన నిలిచియు, మధ్యాహ్న
కాలం బున నర్కమండలం బాలోకించియు, వర్షాకాలంబునఁ
జలధర జలబిందుధారలం దోఁగియు, శిశిరకాలంబునం దివతాళించు
కొలంకులలోనం బుక్కిటిబంటి నీట నిశాసమయంబుల నిలిచియు,
నంబుచుళుకంబులును నుడుపతికరంబులును సురకరువలిం
డుల్లిన జీర్ణ తరుపర్ణంబులును నాహారంబుగా దుష్కరం బైన
తపంబు సేయుచుండ నొక్కనాఁడు. 7

★మ. అజినాషాఢధరుండు ప్రౌఢతరభాషాతిప్రగల్భుండు నీ
రజబంధుప్రతిమాన తేజుఁడు జటా రాజిచ్ఛటాతామ్రమూ
ర్ధజుఁడేకాకివటుండు బ్రాహ్మణుఁడు విశ్రమార్థముంబోలె నా
త్రిజగన్మోహనమూ ర్తిసన్నిధికి నేతెంచెన్ వనాంతంబునన్. 8

తే. ఇవ్విధంబున నేతెంచి యెదుట నిలిచి,
గౌరి నాశీర్వదించె నక్కపటవటుఁడు
కలితకోమలనవకుశగ్రంథి యైన,
యంగుళీపల్లవముతోడి హస్త మెత్తి. 9

వ. పార్వతియు బహుమానపురస్సరంబుగా నయ్యుర్వీసురవటు
నకు నతిథిపూజ యొనర్చె. నతండును గొండరాచూలి సేయు
సత్కారం బంగీకరించి ముహూ ర్తమాత్రంబునం బరిశ్రాంతి
నపనయించి మెయివడిచూపునం జూచి ప్రస్తా వోచితంబుగా
నిట్లనియె. 10

సీ.   సలిలంబు త్రిషవణస్నానక్షమం బౌనె
        యంభోజపత్రదీర్ఘాయతాక్షి !
కుసుమంబులును నిధ్మకుశపల్లవంబులు
        సులభంబు లై యున్నె సుందరాంగి !
సత్త్వంబు లన్యోన్యజాతివై రముఁ దక్కి
        శాంతి గైకొని యున్నె చంద్రవదన !
యనుదినంబును దేహయాత్ర కాయితమౌనె
        నీవారశాకాది పూవుఁబోణి !

తే. శక్తికొలదిఁ దపశ్చర్య సంఘటింతె,
ఫలముపై నాస నాగ్రహబంధ ముడిగి
తామ్రబింబోష్ఠి ! ధర్మసాధనములందు,
నాద్య మగు సాధనంబు దేహంబ కాదె !   11

క. మగువా ! నీ పెంచిన లత
చిగురున ముకుళంబు లుల్లసిల్లెనె చెపుమా
పగడపుఁ గెమ్మోవిపయి
న్నగ వుదయించినవిధంబునం బ్రస్ఫుట మై.   12

క. పంకజలోచన ! కరద
ర్భాంకురములు మేసినట్టి యపరాధమునన్
రంకుమదపోతకంబుల
జంకింపవుగా తపఃప్రశాంతి వెలితిగాన్.   13

తే. అభ్రవీథీపరిచ్యుతంబై నయట్టి
యమరతటినీజలప్రవాహమ్ముకంటె
ధరణిధరరాజు నీచరిత్రంబుకతనఁ
బరమపావనుఁ డయ్యె నోపద్మనయన !   14

వ. సంబంధంబు సాప్తవచనంబు గావుననింతదడవు నీతోడఁ గలసి
పలుకుచునికింజేసి యే నా ప్తుండఁ. గావున, నొక్క మాట యడిగెద.
రహస్యంబు గాకుండెనేనిం జెప్పుమా.   15

సీ. ప్రథమప్రజానాథపావనకులమునఁ
ప్రభవించి తఖిల ప్రపంచసార
సౌందర్యసంపద సడిసన్న దాన వ
నశ్వరం బై శ్వర్యనై పుణంబు
సౌఖ్యంబు నిరవధి సర్వసామగ్రి నీ
యఱచేతి భోగ్యమత్యాయతంబు
భాగ్యంబు నీ కేమి బ్రాఁతి యైనది మనో
రథ మేమి చెప్పుమా రాజవదన

తే. దుష్కరం బై నతప మిట్లు దొడరి చేసి
మేను డయ్యించుకొనఁగ నేమిటికి వచ్చెఁ
జిత్తము విచారమార్గంబుఁ జేరఁదెచ్చి
త త్త్వముఁ దెలియఁ జెప్పు చూతము మృగాక్షి. 16

వ. పితృ గేహంబున నవమానంబు పుట్టదు గదా ! పన్నగఫ ణారత్నంబున మీఁదఁ జెయిసాఁచువాఁడు గలండే ? నిండు జవ్వనంబునకుం దగిన విభూషణంబులు తొలంగంబెట్టి వార్ధ కోచితంబు లగు వల్కలంబు లెట్టులు ధరించితివి? దేవలోక నివాసంబున కాసపడెదేని నది వృథా శ్రమంబు ! నీ పుట్టి నిల్లు దేవభూమియ కదా ! తగిన వరునిం గామించి సమాధి వహించితివేని నదియు నీకుం దగదు. రత్నం బొరుచే నన్వేషింపఁబడుఁగాని యొరు నన్వేషించునే? వేఁడి నిట్టూ ర్పుగాడ్పులచే దుర్లభజనానురాగంబు నీయందుఁ దేట పడుచున్నది. అట్టి కఠిన హృదయం డెవ్వండొకో, వాఁ డెవ్వండేని నీవు తపంబు సేయంబూని కలమాగ్ర పింగళంబగు జటాధారంబు ధరియింప నుపేక్షించునే యని యంత నిలువక యక్కపటవటుండు. 17

✶ఉ. ఏనును బ్రహ్మచారిఁ దరళేక్షణ ! నీవును గన్య వింత కా
లానకు నీకుఁ బెండ్లి యె ఫలం బగునేని విచార మేల స
న్మానముతోడ నన్ను మునిమాన్యవివాహముగమ్ములెమ్ము కా
దేనిఁ దపంబులోని సగ మిచ్చెద మాను తపోభిమానమున్. 18

వ. అనినం బార్వతి యమ్మిథ్యావటునకుం దన మనోరథం బెఱిఁగింప
నొల్లక, వయస్యం గన్నుసన్న సేసిన, నచ్చెలి క త్తెయు నత్తపోధన
కుమారునితో నిట్లనియె. అయ్యా ! నీకుఁ గుతూహలంబు గలదేని
వినుము. జనకు నింట ధృతిం జెందక మహేంద్రప్రభృతులగు
దిగీశుల నుజ్జగించి పినాకపాణిం బతిఁ గాఁ గోరి తపంబు సేయ
సమకట్టె యని పల్కిన. 19

చ. వికవిక నవ్వి యక్కపటవిప్రకుమారుఁడు మేలు లెస్స వా
నికి నయి రాగబంధమును నిల్పె మదిం దరళాయతాక్షి మీ
సకియ వివాహవేళఁ బురశాసనుపాణిఁ బరిగ్రహించుచో
మొకమున బుస్సుమంచు నహిమ్రొగ్గిన నెట్లు భయంబు చెందునో
20

సీ. రాయంచ యంచుఁజీరకు జోకయగుఁగాక
        పచ్చియేనికతోలుపచ్చడంబు
హరిచందనాస్పదం బగు చన్నుఁగవమీఁదఁ
        బట్టుఁ జేకొనుఁగాక భసితధూళి
కమనీయచరణలాక్షారాగలేఖచే
        ముద్రితం బగుఁగాక రుద్రభూమి
కలితముక్తాఫలగ్రైవేయకంబుతోఁ
        దులఁదూఁగుఁగాక పెంజిలువపేరు

తే. మనువు లెస్సయి యుండెఁ బో మానవతికి
నివ్విధం బన్న లోకంబు లెల్ల నగరె
యహహ ! ముదిగోద నెక్కి భిక్షాటనంబుఁ
జేయఁ బోవుట యదియు మెచ్చాయెఁ జువ్వె. 21

ఉ. అంధపరంపర న్వెణఁగ వై యభవున్విని, వాని తోడిసం
బంధము గోరి నిర్భరతపఃకృశ కోమల దేహయష్టివై
బాంధవకోటితోడఁ బెడఁబాసిన నీవును నింద్యవౌదు సౌ
గంధిక బంధు రేఖయనఁ గామిని! మాటలు వేయు నేటికిన్. 22

ఉ. పుట్టు వెఱుంగ నెవ్వరికిఁ బోలదు; మూఁడవకన్నుఁ జూచి చే
పట్టఁడు వెఱ్ఱివాఁ డయినఁ(బ్రాణహరుం డటె జంతుకోటికిన్;
గట్టినతోలుచీర కలికల్మిఁ(బ్రకాశము సేయుచున్న; దె
ప్పట్టునఁ జూచినన్ శివునిపైసి యెఱుంగఁగరాదె భామినీ! 23

తే. మాటలేటికిఁ జాలింపుమా తపంబు,
హరునిఁ గూర్చి సరోజపత్త్రాయతాక్షి !
వధ్యుఁ దివియంగఁ బాఱిన వాఁడికొఱ్ఱు
యూపసత్క్రియ కర్హమై యున్నె చెపుమ. 24

వ. అనిన నక్కపటవటునకు నవ్వధూటి యి ట్లనియె. 25

ఉ. చాలు వివాదము ల్వడుగ శంభునిఁగూర్చి; మహేశుఁ డన్ననీ
వాలముచేసిపల్కి; తెటులైనను నౌ, విను, చంద్రమఃకళా
మౌళిపయిన్మదీయ మగుమానస మెంతయుఁజిక్కె, నింకనేఁ
జాలుదునయ్య! యెమ్మెయిభుజంగవిభూషణునిందొఱంగఁగన్ 26

వ. అని జయావిజయలం గనుంగొని యపాంగంబులఁ గెంపు గదుర
నీబ్రహ్మచారి శంకరుని గుఱించి నిశ్శంక నింకను వంకర కొంకర
మాటలాడ నుంకించుచున్న వాఁ డితని మెడ వట్టి నూకుం డని
పల్కి కోపావేశంబున. 27

చ. జిలుఁగగువల్క లాంచలముచెన్నయి చన్ను లమీఁద జాఱఁగా
నలుకఁ దుషారశైలసుత యవ్వలిమో మయి నాలుగేన్పదం
బులు సని భ్రూకుటీకుటిలముగ్ధలలాట ముఖేందుబింబ యై
మలఁగికనుంగొనెన్ భుజగమండనుఁడైన శరద్విజోత్తమున్. 28

★శా.సాక్షాత్కారమునొందినవ్వుచుమహేశానుండుధాత్రీధరా
ధ్యక్షాపత్యముఁ బ్రేమనిర్భరకటాక్షాలోకనప్రౌఢిమన్
వీక్షించెన్ దరళాక్షియు న్మనమునన్ వ్రీడాప్రమోదక్షమా
దాక్షిణ్యంబులు సందడింప నిలిచెం దత్సన్నిధానంబునన్. 29

చ. అరుదగు నీతపమ్మునకు నమ్మెడువోయితి నేలుకొమ్ము నీ
వరువుడ వంచు శూలి ప్రియవాక్యములందగ గారవింపఁగా
ధరణిధరేంద్రనందన యుదగ్రతపోమహనీయవేదనా
భరమఖిలంబువీడ్కోలిపి భావమునంబరితోషమందుచున్. 30

అధ్యయన వేదిక

అర్థములు :

వల్కలములు = నారచీరలు; మౌంజి = దర్భమొలత్రాడు; స్థండిలము = నిద్రించుటకు దర్భాదులచే సంస్కరింపబడిన భూమి; అర్కమండలము = సూర్యమండలము; ఇవతళించు = చల్లనగు; ఉడుపతికరములు = చంద్రుని కిరణములు; అజినాషాఢధరుండు = పులి తోలును ధరించినవాడు; నీరజబంధుడు= సూర్యుడు; తామ్ర మూర్ధజుడు = ఎర్రనైన శిరస్సు గలవాడు; నవకుశ = క్రొత్తదైన దర్భ; కొండరాచూలి = హిమవంతుని కుమార్తె (పార్వతి); త్రిషవణ = మూడు కాలములు; ఇధ్మకుశపల్లవంబులు = సమిధలు, దర్భలు, చిగురుటాకులు; సత్త్వంబులు = జంతువులు; నీ వార = అడవిలోని ధాన్యము; సాప్త వచనంబు = ప్రేమ పలుకులతో కూడినది; పింగళం = గోరోజనపు వర్ణము; వయస్య = చెలికత్తె; పినాక పాణి = ఈశ్వరుడు; పురశాసనపాణి = ఈశ్వరుడు; అహి = పాము; ముదిగోద = ముసలి ఎద్దు; వెడగు = వెర్రివాడు; యూపము = యజ్ఞము; వ్రీడ = సిగ్గు; శూలి = ఈశ్వరుడు; పచ్ఛడము = వస్త్రము; గ్రైవేయకంబు = హారము

సంధులు :

ఈ క్రిందివానిని విడదీసి సంధి పేర్లను వ్రాసి, సూత్రములను వ్రాయుము.

ఈశ్వరారాధన, నీలోత్పలము, విశ్రామార్థము. ఇవ్విధము, కెమ్మోవి, తపోభిమానము, భిక్షాటనము, ఆనతి వడసి.

సమాసములు :

ఈ క్రిందివానికి విగ్రహ వాక్యములు వ్రాసి, సమాసముల పేర్లను వ్రాయుము.

హస్తాబ్జములు, శతవృద్ధులు, కపట వటుడు, పినాకపాణి, నీలోత్పలాక్షి.

అర్థ సందర్భములు :

1. పాశుపత మంత్రదీక్షఁజే పట్టె గౌరి
2. ధర్మసాధనములందు నాద్యమగు సాధనంబు దేహంబుకాదె
3. పన్నగ ఫణా రత్నంబుమీదఁ జేయిసాచువాడు గలండే?
4. రత్నం బొరునిచే నన్వేషింపఁబడుఁగాని యొరు నన్వేషించునే
5. వధ్యుదివి యంగఁ బాతిన వాడికొఱ్ఱు
   యూపసత్క్రియకర్హమైయున్నె చెపుమ

ప్రశ్నలు :

1. పార్వతి పాశుపతదీక్ష చేపట్టిన విధమును వివరింపుము?
2. కపట వటుడు పార్వతితోనేమని పల్కెను?
3. కపట వటువు ఈశ్వరుడెట్టివాడని పల్కెను?
4. పార్వతి కపట వటువునకెట్లు ప్రత్యుత్తరమిచ్చెను?
5. ఈశ్వరుడెట్లు సాక్షాత్కరించెను?

విద్యార్థులకు సూచన :

శ్రీనాథుని గ్రంథమైన హరవిలాస మంతయు చదువుడు.

ఉపాధ్యాయులకు సూచన :

శ్రీనాథుని గ్రంథములను విద్యార్థులకు పరిచయము గావింపుము.